# 8. సువర్ణసుందరి కథ

మొన్న జనవరి నెలలో హైదరాబాద్‌లో ఒక డైరెక్టరేట్ నుంచి ఒకానొక విన్నపం మీద ఆర్డర్సు రావలసి ఉండింది. 'ఆర్డర్సు' అంటే మేం కోరిన ప్రకారం ఇచ్చే ఆర్డర్సే తప్పా వారి యొక్క నిష్పాక్షికమైన ఆర్డర్సు కాదని వేరే చెప్పక్కర్లేదు కదా.

సదరు డైరెక్టరేట్‌లో నాకు తెలిసిన వాళ్లు ఎవరూ లేరు. అందుచేత నేను స్వయంగా హైదరాబాద్ వెళ్తే పని అవుతుంది, కాకపోతుంది. అందుకని అభిమన్యుడిలా కాకుండా ఫల్గుణుడిలా రంగంలో ప్రవేశించ గల మనిషి కోసం వెతగ్గా వెతగ్గా, గుర్రాజు సంగతి ఎవరో నాకు గుర్తు చేసేరు.

గుర్రాజు ఘటనా ఘటన సమర్థుడని నాకిది వరకే తెలుసు. అతన్ని పంపొచ్చని తట్టినా అతని ఖర్చు నేను భరించగలనా-అనే అనుమానం వల్ల ఆ ఆలోచనని పైకి రానివ్వలేదు. కాని, చివరికి తప్పలేదు.

ఏంలేదు. రైలు టిక్కెట్టు దగ్గర్నుంచీ గుర్రాజుది అంతా మాయ. "ఫస్టు క్లాసులో తప్ప ప్రయాణం చెయ్యలేను. అబ్బో! ఈ సెకండ్ క్లాస్ బెర్తుల్లో ఎవడెల్తాడ్రా నాయనా, తొక్కిడి, రిజర్వేషన్ లేని వాళ్ళొచ్చి వొళ్లో కూచుండిపోతారు. కంపార్టుమెంట్లు చాలా వాట్లో లైట్లు వెలగవు. ఫ్యాన్లు తిరగవు, కక్కోసుల్లో నీళ్లు రావు" అంటాడు. సిటీ బస్సుల్లో ప్రయాణం చేసి ఆటోల్లో తిరిగేనంటాడు. ప్లేటు భోజనంతో ఆకలి చల్లార్చేసుకుని త్రీస్టార్ హోటల్ డైనింగ్ హాల్లో తిన్నానంటాడు. ఆ ఆఫీసులో గుమస్తాకీ, సూపరింటెండెంటుకీ, డెప్యూటీ స్థాయి అధికారికి ఇంత, యింత, అంత డబ్బు చొప్పున లంచా లిచ్చేనంటాడు. ఇలా మిగుల్చుకున్న డబ్బుతో బార్లు పావనం చేస్తాడు.

ఐతే, గుర్రాజు పనిమాత్రం ఖచ్చితంగా జరిపించుకొస్తాడు. దాంట్లో ఏం సందేహం లేదు! అందుచేత ఈ రకం ఖర్చుల మీద ఆడిట్లకి పోకుండా సర్దుకుంటారు. ఎవరికివారే.

ఆ విధంగా జరిగింది, కొత్తగా మావూరి ఆఫీసులో శాంక్షనైన అదనపు పోస్టులో అల్లుణ్ణి నిజామాబాద్ జిల్లా నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించి వేయించడానికి గాను నేను గుర్రాజుని హైదరాబాద్ పంపడం.

***

వెళ్ళినవాడు ఫల్గుణుడే అయినా సవ్యసాచిలా డబ్బు ఖర్చు పెట్టేశాడే తప్పా ఆర్డర్సు మాత్రం తీసుకొని రాలేకపోయాడు గుర్రాజు. అతడు కథించిన వివరం బెట్టిదన:

"ఆ ఆఫీసులో ట్రాన్స్‌ఫర్లు పోస్టింగులు చూసే గుమస్తా పేరు నిరంజన్ రావ్. అతగాడు ఉదయం పూటంతా ఏవో చాటలంతేసి స్టేట్‌మెంట్లతో యమా బిజీగా ఉంటూ మధ్యాహ్నం రండిసార్ - అని మూడు రోజులపాటు నన్ను తిప్పాడు" అని ప్రారంభించేడు.

"పోనీ మధ్యాహ్నమే వెళ్లవలసింది...!"

"వెళ్లానుగా! మూడు రోజులు మధ్యాహ్నం పూట అతనికి సెక్రటేరియట్‌లో ఆఫీసు పని తగిలింది. ఇదుగో సెక్రటేరియట్ కెళ్లొస్తానని వెళ్లేవాడు. నాలుగున్నరా, ఐదు - అవుతూ ఉన్నప్పుడు వాళ్ల సూపరెంటు గారు గొంతు సర్దుకుని- అతనింక ఈ పూట రాడు సార్, మీరు రేపు ఉదయం రండి- అని చెప్పేవాడు. అదేం అలాగ అని నేను అడిగితే సెక్రటేరియట్‌లో పని అయినా కాకపోయినా అక్కణ్ణించి ఇంటికి వెళతాడు, ఎందుకంటే అతనుండే వనస్థలిపురానికి సెక్రటేరియట్ నుంచి ఉన్నట్టుగా బస్సులు ఇక్కణ్ణుంచి లేవు- అని సూపరెంటుగారు బోధపరిచాడు."

"మీరు అతనితో పాటుగా సెక్రటేరియట్‌కి ఏ ఆటోలోనో అతనికి సహాయ పడుతున్న ధోరణిలో వెళ్ళుండవలసింది! అలా వెళ్తే దార్లో నిర్మొహమాటంగానో మొహమాట పెడుతూనో మనపని గురించి మాట్లాడి మెల్లిగా అతన్ని లైన్‌లో పెట్టొచ్చుకదా," - అన్నాను.

"అది నిజమే అనుకోండి, నాకా ఐడియా నాలుగోరోజుని తట్టింది. అయితే ఏం లాభం? ఆ రోజు నుంచి అతను వారం రోజులు లీవ్ పెట్టేశాడు."

"మరి మన ఫైలు ఎవరు చూస్తున్నారు?"

"చెబుతా వినండి, నాలుగోరోజు అతని సెలవు కాగితం మీద డైరెక్టరు గారు ఆ సెలవు శాంక్షన్ చేస్తూ సువర్ణ సుందరి అనే ఒక యూడీసీని నిరంజన్‌రావు సీట్లో పనిచేయవలసిందిగా ఆర్డర్ వేశారు."

"మరేమీ? ఆవిడతో చెప్పవలసింది మన పని అర్జంటని."

గుర్రాజు నాకేసి చూడ్డం మానేసి మా ఇద్దరికీ పైన తిరుగుతున్న ఫాన్ వైపు చూస్తూ మాట్లాడ్డం మొదలెట్టాడు. "సువర్ణ సుందరంటే సువర్ణసుందరేనండీ, ఆవిడ! ఆహా! ఏమి దేహచ్ఛాయ, ఏమి సౌందర్యం! బంగారపు బొమ్మ అనుకోండి!" ఆ నాలుగు మాటలూ అని నవ్వి కళ్లు మూసుకున్నాడు గుర్రాజు.

"ఏడిసినట్టుంది, మీకిన్నాళ్లూ మందు అలవాటే కాబోలనుకున్నాను, ఇది కూడానా? అయితే ఏమిటి, ఆవిడతో నాపని సంగతి వొదిలేసి మీ పని కోసం ప్రయత్నించి రెండు లెంపకాయలు తిని దానికీ దీనికీ ఎసరు పెట్టేశారా?" అన్నాను తీవ్రంగా.

"ఛ, ఛా! మనం పనంటూ మొదలెట్టాలి గాని ఎసరు పెట్టడమనేది ఉందిటండీ? ఆరంభింపరు నీచమానవులు - అన్నాడు భర్తృహరి..."

"మరి ఆరంభించిన వారు ఫలితం తీసుకురాలేదే?"

"ఆగండి చెప్తున్నాను. మూడు రోజులపాటు నిరంజన్‌రావు సీటుపక్కని కూచున్నాను గదా. ఈ సువర్ణ సుందరితో అలాగ పక్కన కూర్చోడం కుదర్లేదు. ఎంతైనా ఆడకూతురు గదా. ఆవిడకి అభ్యంతరం లేకపోయినా చూసేవాళ్లు సరిగా అర్థం చేసుకోరు గదండీ, అంచేత ఉదయం ఒకసారి కనిపించి గుడ్‌మార్నింగ్ చెప్పి మళ్లా గంట పోయాక వస్తానని చెప్పేవాణ్ణి. మళ్లీ గంట పోయాక వెళ్తే ఆవిడ సీరియస్‌గా కాగితాలు రాస్తూ ఉండేది. నేను గొప్ప ఇరకాటంలో పడిపోయాను సార్. అదే మగవాడైతే 'రండి గురూగారూ, కేంటీన్ దాకా వెళ్లి కాఫీ తాగి వద్దాం' అని లాక్కుపోవడం నాకు వెన్నతో పెట్టిన విద్య. సీట్లో కూచుని పని చేసుకుంటున్న ఆడ

ఉద్యోగస్తురాల్ని గానీ, కాపురం చేసుకుంటున్న ఇల్లాల్నిగానీ - నీతో కాసేపు మాట్లాడాలి బైటికి వస్తావా - అంటే నిజంగా మీరన్నట్టు లెంపకాయలే కదండీ?''

"మరి వారం పైగా అక్కడ ఉండిపోయారే మీరు, ఏం చేసినట్టు?''

"ఐడియా తట్టేసరికి రెండు రోజులు పట్టింది సార్. ఏం చెయ్యను? ఆవిడ కాఫీ తాగదు. సిగరెట్ కాల్చదు. మందు కొట్టదు. పోనీ మీ ఇల్లెక్కడో చెప్పండి, ఇంటికి వచ్చి కలుస్తానని చెబుదామంటే దానికీ వేరే అర్థం తియ్యొచ్చుకదా, ఈవిణ్ణి ఎలా లొంగదీసుకోవాలా అని యమ బాధపడిపోయాననుకోండి!''

"మీరావిణ్ణి లొంగదీసు కోడానికి ప్రయత్నించి మా పని పాడుచేసేరు...'' అన్నాను.

"చివరికి సాయంకాలం దాకా ఉండి వో రోజున ఆవిడ ఎక్కిన బస్సే ఎక్కి ఆవిడ దిగిన చోటనే దిగి వాళ్ల క్వార్టర్సు గుర్తెట్టుకుని మర్నాడు ఉదయం ఆరుగంటలకల్లా ఆటోలో వెళ్లి, గుమ్మంలో కూర్చుని పేపరు చదువుకుంటున్న ఆయన్తో కత్తు కలిపాను, సువర్ణ సుందరి గారి భర్త మీరేనాండీ? ఏం అదృష్టవంతులండీ - అంటూను.''

"అలా అన్నందుకు ఆయన నిన్ను చెప్పుతీసి కొట్టుంటాడు, నువ్వు పలాయనం వొచ్చుంటావు'' అన్నాను, అన్ని మర్యాదలు వదిలేసి.

"ఏం లేదు. అతను వెంటనే భార్యని పిలిచి, సుందరీ, ఈయనపని వారం రోజుల్నుంచీ అవడం లేదట, ఈ రోజు ఎలాగో రాసేసెయ్యి - అన్నాడండి.''

"మరి, ఏదీ ఆర్డరు?'' అన్నాను.

"తీరా ఆవిడేమో, నేనెంత రూల్ మనిషినో ఆయనకి తెలీకపోతే మీకు తెలీదా - అని మొగుడి మీద విరుచుకుపడి, మీరు ఆఫీసుకి గాని వచ్చారంటే డైరెక్టర్ గారితో చెప్పి గొడవ చేస్తానంటూ నన్ను కసిరేసిందండి.'' అన్నాడు, గుర్రాజు.

"మొత్తానికి డబ్బూ పోయే శనీపట్టె అన్నట్టు చేసేవు. గొప్పవాడివేలే.'' అన్నాను. మొహం ఇటు తిప్పేసి, పామ్మని అతనికి చెయ్యి ఆడించి.

అతను అలా వెళ్లగానే పోస్ట్‌మేన్ ఒక కవరు తెచ్చి ఇచ్చాడు. అది మా అల్లుడి పేరిట నా కేరాఫ్ అడ్రస్‌కి వచ్చింది. ఆ డైరెక్టరేట్ నుంచీ, సర్వీస్ స్టాంపులు అతికించి.

"నీ అభ్యర్ధన తిరస్కరించడమైనది-'' అనే కదా ఉంటుంది, అనుకుంటూ 'చచ్చేవాడికి సముద్రం మోకాలి బంటి' అన్న ధోరణిలో కవరు తెరిచాను. అందులో మా అల్లుణ్ణి ఈ వూర్లో ఆ ఉద్యోగంలో నియమించినట్టు ఆర్డరుంది. టైపు చేసిన దానికి దిగువన, పెన్సిల్‌తో కనబడీ కనబడనట్టు ఇలా రాసుంది.

"శ్రీ దుర్గారావు గారికి,

మీ పోస్టింగ్ కోసం మీ మామగారు హైదరాబాద్ వచ్చేరు. ఆయనది చాలా పాడుబుద్ధి. నిజానికి ఆయన నన్ను వెంటాడిన దానికి ఫలితంగా మీకీ ఆర్డర్ రాకుండా చేయవలసింది. కానీ పెద్దవారు కదా అని క్షమించి, రూల్ ప్రకారం చేయడమైంది. ఆయన్ను ఇలాంటి కోతిపన్లు చేయవద్దని హెచ్చరించండి.

- ఇట్లు, సువర్ణసుందరి.'' ★